

సింహారోహణం అలంకరణలో బాలాత్రిపురసుందరి అమ్మవారు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో ఏడోరోజైన ఆదివారం కాకినాడ నగరంలోని సూర్యారావుపేటలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు సింహారోహణం అలంకరణలో దర్శనమిచ్చారు. నవావరణార్చన, చండీహోమం జరిపారు. ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి బాబ్జీ, ఈవో ఉండవల్లి వీర్రాజుచౌదరి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. సాయంత్రం కూచిపూడి నృత్యం, నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కేంద్ర మాజీమంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు సాయంత్రం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో మహాచండీదేవిగా అపీత కుచాంబ అమ్మవారు



సామర్లకోటలో మహాలక్ష్మీదేవిగా బాలాత్రిపుర సుందరి



పాదగయలో వాగ్దేవిగా రాజరాజేశ్వరీదేవి



అన్నవరంలో మహాచండీగా వనదుర్గ అమ్మవారు

కాకినాడలో సింహారోహణంలో బాలాత్రిపురసుందరి అమ్మవారు



తగ్గేదేలే!

ఇంకనూ తగ్గని పన్నుపోటు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ 2.0 విధానం అమల్లోకి వచ్చి వారం దాటింది. ఈ నెల 22 నుంచి సుమారు 83 కేటగిరీలకు సంబంధించిన వస్తువులు,సేవలు, మందులపై కేంద్రం జీఎస్టీ శ్లాబ్ తగ్గించిన సంగతి తెలిసిందే. గతంలో నాలుగు శ్లాబ్‌లు ఉంటే.. ప్రస్తుతం రెండు శ్లాబ్‌లకే పరిమితం చేశారు. కానీ ఎక్కడా ఇవి పూర్తి స్థాయిలో అమల్లోకి రావడంలేదు. వ్యాపారులు అసలు ధరలు చెప్పడం లేదు. పాత సరుకు ఉందనే కారణంతో పాత ధరలే వసూలు చేస్తున్నట్టు చెబుతున్నారు. ఈ పరి స్థితుల్లో పాత సరుకు ఎంత ఉందో చెప్పే వారెవరూ కనిపించడంలేదు. తగ్గిన జీఎస్టీ శ్లాబ్ వల్ల ప్రజలకు ఎప్పటికి ప్రయోజనం లభిస్తుం దనేదానిపై స్పష్టత లేదు.

- ఆగని వ్యాపారుల దోపిడీ
- పాత ధరలే కొనసాగింపు
- దసరా ఆఫర్లుగా ప్రకటనలు
- ఎమ్మార్పీపై పాత జీఎస్టీ అమలు
- వారమైనా మారని పరిస్థితి
- తగ్గని పాల ప్యాకెట్ ధర
- తనిఖీలు చేపట్టని అధికారులు
- అవగాహన సదస్సులతో సరి
- మోసపోతున్న కొనుగోలుదారులు

దసరా ఆఫర్ల పేరు..

టీవీలు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, కార్లు, మోటారు సైకిళ్లపై కొంత వరకూ తగ్గినట్టు చెబుతున్నారు. కార్లపై రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ తగ్గగా మోటారు సైకిళ్లపై రూ.15 వేల వరకూ తగ్గింది. టీవీలపై రూ.3 వేల నుంచి రూ. 4 వేల వరకూ తగ్గిస్తున్నారు. కానీ ఇవన్నీ దసరా ఆఫర్లతో కలిపి అమ్ముతున్నట్టు వ్యాపారులే చెబుతున్నారు. అంటే దసరా ఉత్సవాల తర్వాత టీవీలు, ఏసీల వంటి ధరలు కొద్దిగా పెరిగే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. సిమెంట్ ధరలు తగ్గించడం లేదు. పాల ఉత్పత్తుల వద్ద ధరల పట్టీలు పెట్టారు. కానీ పాత సరుకు ఉందని చెప్పడం గమనార్హం.

కొత్త పథకం.. పాత ధర..

ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గించిన 83 కేటగిరీల వస్తువులు, సేవలు వంటి వాటి వివరాలు ప్రకటిం చింది.వీటి ధరలు కచ్చితంగా తగ్గించాల్సిందే. పన్నీరు, టెట్రాప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై ఐదు శాతం జీఎస్టీ ఉండేది. దానిని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా వస్తువుల ధరలు తగ్గుముఖం పట్టాయి. అయితే వ్యాపారులు మాత్రం పాత ధరకే విక్ర యిస్తున్నారు.వెన్న, నెయ్యి, తృణధాన్యాలు, చక్కెర, కాఫీ, సూప్‌లు, బేకింగ్ పౌడర్, నిల్వ ఉంచిన చేప, మాంసం రేటపై జీఎస్టీ గతంలో 12 శాతం ఉండేది. ప్రస్తుతం కేవలం 5 శాతం వసూలు చేయాలి. 20 లీటర్ల తాగునీటి డబ్బాలు, కొబ్బరిపాలు, బాదం, జీడి పప్పు పాలు, అవిసెపాలు, బియ్యంపాలు, ఓట్ పాలు పండ్ల గుజ్జు, రసాలు, పాలు ఆధారిత పానీయా లపై గతంలో 18 శాతం జీఎస్టీ వసూలు చేసేవారు. ఈ శ్లాబ్‌ను 5కి పరిమితం చేశారు.

అసలు ఎంత తగ్గాయంటే!

- విద్యార్థులు ఉపయోగించే వ్యాయామం, ఎరేజర్లు, పుస్తకాలు, పెన్సిళ్లపై జీఎస్టీని ఎత్తేశారు.జామెట్రీ, రంగు పెట్టెలు,పేపరు కార్టూన్లు తదితర వస్తువులపై 12 శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- అరుదైన వ్యాధులకు సంబంధించిన మందు లపై పూర్తిగా జీఎస్టీ ఎత్తేశారు. యునాని, సిద్ధ, హోమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్ కిట్లు, రసాయనాలు,గ్లూకోమీటరు,సర్జికల్ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.థర్మామీటరుపై 18 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- వ్యవసాయ పరికరాలు,యంత్రాలపై గతంలో 12, 18 శాతం జీఎస్టీ ఉండేది.. మొత్తం 5 శాతానికి తగ్గించారు. వ్యవసాయ సంబంధిత పరికరా లు ఏం కొన్నా 5 శాతమే వసూలు చేయాలి.
- వాహనాలపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. సైకిళ్లు,వాటి భాగాలపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. మిగిలిన గృహ నిర్మాణ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు.
- టీవీలు, ప్రొజెక్టర్లు, ఏసీలు, డిష్ వాషర్లపై గతంలో 28 శాతం జీఎస్టీ ఉంటే దానిని 18 శాతానికి పరిమితం చేశారు.సోలార్ వాటర్ హీటర్, సిస్టమ్స్ సోలార్ కుక్కర్లపై 12 శాతం ఉంటే 5శాతానికి పరిమితం చేశారు.
- బొమ్మలు, క్రీడాపరికరాలు, చేతిపనుల వస్తువులపై 5 శాతమే.
- ఫీడింగ్ బాటిళ్లు,స్టీల్, అల్యూమినియం, రాగి వంటి పాత్రలు, ఫీడింగ్ బాటిళ్లు, బేబీ న్యాప్ కిన్‌లు,డైపర్లు, కొవ్వొత్తులు, స్టీలు, అల్యూ మినియం,రాగి ఇత్తడి,వంటగది పాత్రలు,కుట్టు యంత్రాలు, రబ్బరు బ్యాండ్లపై 12 శాతం జీఎస్టీని 5శాతానికి పరిమితం చేశారు.
- కాఫీ, చాకెట్లు, పేస్ట్రీ, కేక్‌లు, బిస్కెట్లు, జామ్‌లుపై గతంలో 18శాతం జీఎస్టీ ఉండేది.దానిని 5 శాతానికి పరిమితం చేశారు.బాదం, పిస్తా, హాజెల్ నట్స్, ఖర్జూరం, అంజీర్ మొదలైన డ్రైఫ్రూట్లు, పాస్తా,మాకరోనీ, నూడుల్స్, ఊరగాయలు, పండ్లు, కూరగాయల రసాలపై గతంలో 12 శాతంగా ఉండే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు.
- సబ్బులు,హెయిర్ ఆయిల్, షాంపూలు, దువ్వెనలు, ఫౌడర్లపై జీఎస్టీ 12 నుంచి 5 శాతానికి తగ్గింది. టాల్కర్, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్లపై 18 శాతం ఉంటే జీఎస్టీని 5 శాతానికి పరిమితం చేశారు. పన్ను తగ్గించినా వ్యాపారులు ఇంకా పాత పన్ను విధానమే అనుసరిస్తున్నారు.



18 వరకూ అవగాహన సదస్సులు

ఏ వస్తువుపై ఎంత జీఎస్టీ అనేది ప్రభుత్వం ప్రకటించింది. వినియోగదారులు వాటి పట్ల అవగాహన చేసుకుంటే మార్కెట్‌లో ఏ వస్తు వుకు ఎంత తగ్గిందో అడిగి కొనుక్కోవచ్చు. 22వ తేదీకి ముందు ఎమ్మార్పీని ఇవాళ ఉన్న ఎమ్మా ర్పీతో అవగాహన చేసుకుంటే వ్యాపా రులు దిగొస్తారు.లేకపోతే దోపిడీ తప్పదు. ఈ మేరకు అధికార యంత్రాంగం అవగాహన సదస్సులు చేపడుతోంది. వచ్చే నెల 18వ తేదీ వరకూ ప్రచారం ఉంటుంది.19న సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరిట దీపావళిని ఒకరోజు ముందుగానే నిర్వహించనున్నారు.

తీరనున్న కష్టాలు

- గతేడాది వరద పనులకు మోక్షం
- ఆరు నియోజకవర్గాలకు రూ.10.65 కోట్లు మంజూరు
- నామినేషన్, టెండర్ల పద్ధతిలో పనుల నిర్వహణకు సన్నాహాలు

(పిఠాపురం/గొల్లప్రోలు-ఆంధ్రజ్యోతి)

అసంపూర్తిగాఉన్న వరద పనుల నిర్వహణకు ఎట్టకేలకు మోక్షంలభించింది. ఆరు నియోజకవర్గాల పరిధిలో వరద పనులకు నిధులు మంజూరుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీచేసింది. వీటిని నామినేషన్, టెండర్ల పద్ధతిలో నిర్వహించేందుకు ఇరిగేషన్‌అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది ఆగస్టు, సెప్టెంబరునెలల్లో కురిసిన అతి భారీవర్షాలు, ఏలేరు, పంపా, తాండవ, సుద్దగడ్డ కాలువలకు సంభవించిన భారీవరదల కారణంగా పంటకాలువల వ్యవస్థ చిన్నాభిన్నమైంది. ఎక్కడిక్కడ భారీ గండ్లు పడ్డాయి. ఏలేరు రిజర్వాయరునుంచి గతంలో ఎన్నడూలేనివిధంగా ఒకేసారి 48వేల క్యూసెక్కులకు పైగా వరద నీటిని దిగువకు విడుదల చేశారు. కాలువల సామర్థ్యం 6వేల క్యూసెక్కులు మాత్రమే ఉండడంతో వరద నీటి ఉధృతికి పలుచోట్ల భారీ గండ్లు పడ్డాయి. పిఠాపురం, జగ్గంపేట, పెద్దాపురం, ప్రత్తిపాడు, కాకినాడ రూరల్, తుని నియోజకవర్గాల పరిధిలోని ఏలేరు,పీబీసీ,పంపా,తాండవ, పుష్కర కాలువలతోపాటు చెరువులకు గండ్లు పడడంతోపాటు పలుచోట్లకోతకు గురయ్యాయి. కొన్ని ప్రాంతాల్లో గట్లు కొట్టుకుపోయాయి. పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాల్లోని కొన్ని ప్రాంతాల్లో 100నుంచి 500 మీటర్ల మేర గండ్లు పడడంతోపాటు కాలువలు దెబ్బతినడంతో 70 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు ముంపునకు గురయ్యాయి. కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 280 గండ్లు పడ్డాయి.

అత్యవసరమే పూర్తయ్యాయి

వరదలు, భారీ వర్షాల కారణంగా కాలువలు, చెరువులకు పడిన గండ్లను పూడ్చేందుకు నిధులుకావాలని ఇరిగేషన్ అధికారులు 2024, సెప్టెంబరులో ప్రభుత్వానికి నివేదించారు. కలెక్టర్ అప్పుడు అత్యవసర పనుల నిర్వహణకు అనుమతులు ఇచ్చారు. రెండు విడతల్లో 67 పనుల నిర్వహణకు రూ.5.51కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తిచేశారు. దీంతో రైతులకు తాత్కాలికంగా ఇబ్బంది లేకుండా పోయింది.

క్లోజర్ పరిమితం

సాధారణంగా వరదల సమయాల్లో పడిన గండ్లు, గట్లు కోత, ఇతర మరమ్మతుల పనులను క్లోజర్ సమయాల్లో చేస్తారు. అయితే ఈ ఏడాది వరద పనులను మినహాయించి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో వాటినే చేపట్టారు. ఎక్కడిక్కడ గండ్లు పూడ్చకుండా వదిలివేయడం, కాలువ గట్లు కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో సార్వాసాగును రైతులు ఆందోళనల మధ్యే ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో రైతులు డబ్బులు వేసుకుని స్వయంగా గండ్లు పూడ్చుకున్నారు. తాత్కాలికంగా ఇసుక బస్తాలు వేశారు.

నిధులు మంజూరు చేయాల్సిందే

వరదలు, అధికవర్షాల కారణంగా ఆరు నియోజకవర్గాల పరిధిలో పడిన గండ్లు పూడ్చివేత, కోతకు గురైన గట్లు పటిష్టత, ఇతర మరమ్మతుల నిర్వహణకు నిధులుమంజూరు చేయాలని రెండున్నర నెలల క్రితం కాకినాడలో జరిగిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు, నీటి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీంతో కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో సమావేశమై ఏయే పనులు



వరదల కారణంగా ఏలేరు కాలువకు పడిన గండి

చేపట్టాలనే విషయమై నివేదిక తీసుకుని ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాతోపాటు తూర్పుగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరిజిల్లాలపరిధిలో పనుల నిర్వహణకు నిధులు మంజూరుచేయాలని ఇరిగేషన్‌శాఖ ప్రతిపాదించింది. దీనికి నిధులు లేవంటూ ఆర్థిక శాఖ క్వారీ వేసింది. ఈ అంశాన్ని జలవనరుల శాఖమంత్రితోపాటు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఇతర ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఈ పనులకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

నిధులు మంజూరు

రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా వరద పనులు(ఎఫ్‌డీఆర్) నిర్వహణకు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆరు అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో 201 పనుల నిర్వహణకు రూ.10.65 కోట్లు విడుదల చేసింది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో 69 పనుల నిర్వహణకు రూ.3.79 కోట్లు, జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో 105 పనులకు రూ.4.90 కోట్లు, పెద్దాపురం పరిధిలో 20 పనులకు రూ.1.67 కోట్లు, ప్రత్తిపాడు పరిధిలో 4 పనులకు రూ.3.70 లక్షలు, కాకినాడ రూరల్ పరిధిలో ఒక పనికి రూ.3.30లక్షలు, తుని నియోజకవర్గంలో రెండు పనులకు రూ.9.52 లక్షలు కేటాయించారు. ఈ నిధులతో తక్షణం పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఇప్పుడు కాలువలకు నీరు విడుదలవుతున్నందున పనుల నిర్వహణ ఇబ్బందికరంగా ఉంటుందని భావిస్తున్నారు. సార్వా,దాళ్వా పంటల మధ్య సమయంలో కాలువలకు నీరు విడుదల చేయని సమయంలో పనుల నిర్వహణకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

పనులు త్వరితగతిన పూర్తికి చర్యలు

-శేషగిరిరావు, ఏలేరు ఇరిగేషన్ ఈఈ, పెద్దాపురం

వరద పనుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ జీవో జారీచేసింది. ఉన్నతాధికారుల ఆదేశాలతో పనులు త్వరితగతిన నిర్వహించేందుకు చర్యలుతీసుకుంటాం. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూ.10లక్షలలోపు పనులను నీటి సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిపై చేపట్టి, రూ.10 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగిన పనులకు టెండర్లు పిలిచి పనులు చేపడతాం.

నేటినుంచి పీహెచ్‌సీ వైద్యుల విధుల బహిష్కరణ

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లు తమ డిమాండ్ల పరిష్కారం కోరుతూ సోమవారం నుంచి అత్యవసర సేవలు మినహా విధులు బహిష్కరించనున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సమ్మెను దశలవారీగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సోమవారం నుంచి ఓపీ సేవలను నిలుపుదల చేస్తున్నారు. జిల్లాలో 37 పీహెచ్‌సీలుఉండగా అందులో 104 మంది వైద్యాధికారులు పనిచేస్తున్నారు.వీరందరూ రెగ్యులర్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి వృత్తిపరంగా అనేక సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సమ్మె బాట పట్టనున్నారు. రెండురోజులుగా వీరంతానల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్నారు. ఇలాగే కొనసాగితే వైద్యసేవలను పరిపూర్ణంగా నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి తమతో చర్చలు జరిపి డిమాండ్లను పరిష్కరించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ సందీప్ కోరారు.

శాస్త్రీయ నృత్యం, సంప్రదాయాలను కాపాడుకోవాలి: ఎంపీ

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మన శాస్త్రీయ నృత్యాన్ని, సంప్రదాయాలను కాపాడుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. నృత్యాంజలి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గోదావరి కళాక్షేత్రంలో ఆదివారంఉదయం 8గంటల నుంచి రాత్రి 9గంటల వరకు దసరా నృత్య మహోత్సవం, శక్తి పురస్కార్-2025 ప్రదానోత్సవాలను సంస్థ డైరెక్టర్, ప్రముఖ నాట్యాచార్యుడు హరిగురు శరవణ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్, విశాఖ, విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాల్లోని పలు ప్రాంతాలకు చెందిన వందలాదిమంది నృత్య విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, సభ్యుడు వసంత్ కిరణ్‌కు శక్తి పురస్కార్ ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ ఉదయ్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా నేటి యువత, చిన్నారులు భారతీయ సంస్కృతి కళా వైభావం నేర్చుకునేలా ప్రోత్సహించేందుకు అవకాశం ఉందన్నారు. శక్తి పురస్కార్ గ్రహీత వసంత్ కిరణ్ మాట్లాడుతూ కళలకు పుట్టిల్లు అయిన కాకినాడలో ఎందరో అద్భుతమైన కళాకారులు ఉన్నారని, వారికి సరైన మార్గదర్శనం, సహకారం అందించాలని కోరారు. అతిథులుగా హాజరైన నృత్యాంజలి అకాడమీ వ్యవస్థాపకులు హరి లోకేశ్, కృష్ణవేణి మాట్లాడుతూ తమ అకాడమీ ఎన్నో వేలమంది కళాకారులకు నిలయంగా మారడం తమ అదృష్టమన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నగరానికి చెందిన ప్రముఖ నాట్యాచార్యులు, ఫ్యాబిన్ కన్వెన్షన్ సీఈవో తేజానాయుడు, చిన్నారులు, కళాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వసంత కిరణ్‌కు శక్తి పురస్కార్ ప్రదానం చేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్

తెలుగు భాషకు జీవం పోసిన నవయుగ కవి జాషువా

- అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషకు జీవం పోసిన నవయుగ కవి గుర్రం జాషువా అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కాకినాడ నాగమల్లి తోట కూడలిలో ఉన్న సత్కళా వాహిని కల్యాణ మండపంలో ఆదివారం గుర్రం జాషువా 130వ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు ప్రముఖ కవయిత్రి డాక్టర్ కస్తూరిని, కవులను, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



కస్తూరిని సత్కరిస్తున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో యథావిధిగా నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన వెలువరించారు.ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు కార్యక్రమం జరుగుతుందన్నారు.జిల్లాఅధికారులంతా విధిగా హాజరుకావాలన్నారు. ప్రజలు మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేయవచ్చన్నారు.

పిఠాపురంలో వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి

- నడిరోడ్డుపై కొట్టిన ఆటో యూనియన్ ప్రతినిధులు
- సోషల్ మీడియాలో సీసీ ఫుటేజీ వీడియో హల్‌చల్
- ఈనెల 22న ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి..
- బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు

పిఠాపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఆటో యూనియన్ ప్రతినిధులుగా చెప్పుకుంటున్న వ్యక్తులు ఒక వ్యక్తిపై విచక్షణారహితంగా దాడి చేసి నడిరోడ్డుపై కొట్టిన దృశ్యాలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. పిఠాపురం పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం వద్ద నిత్యం భక్తులతో రద్దీగా ఉన్న సమయంలోనే ఇది జరిగినట్టుగా కనిపిస్తోంది. ఈనెల 22న జరిగిన ఈ ఘటన ఆదివారం రాత్రి వెలుగులోకి రావడంతోపాటు పోలీసుల తీరుపై విమర్శలు చేస్తూ సోషల్ మీడియాలో పలువురు దాడి వీడియోలను షేర్ చేశారు. శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం వద్ద ఉన్న ఆటో యూనియన్ సభ్యత్వాలను లక్షలాది రూపాయలకు అమ్ముకుంటున్నారనే విషయమై ఇటీవల పలు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 22వతేదీ మధ్యాహ్న సమయంలో దవులూరి గంగబాబు అనే వ్యక్తిని ఆటోయూనియన్ ప్రతినిధులు రామ్, లక్ష్మణ్ మరో వ్యక్తి అవినాష్‌తో కలిసి నడిరోడ్డుపై విచక్షణారహితంగా కొట్టారు. దాడి సమయంలో అక్కడ ఉన్న భక్తులు, స్థానికులు వారిని నియంత్రించే ప్రయత్నం చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గాయపడిన గంగబాబు ఫిర్యాదు మేరకు పిఠాపురం పట్టణ పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలించారు. రామ్, లక్ష్మణ్‌లపై గతంలో రౌడీషీట్ ఉండగా తొలగించారని, ఇప్పుడు మళ్లీ రౌడీషీట్లు తెరిచామని పోలీసులు తెలిపారు. శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానం పరిసరాల్లో జరుగుతున్న ఘటనలపై విచారిస్తున్నట్టు చెప్పారు.

వేటకు వెళ్లకుండా ఇళ్లవద్దే..

- డిప్యూటీ సీఎం రాకకోసం ఉప్పాడ మత్స్యకారుల నిరీక్షణ

కొత్తపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరప్రాంతాల గ్రామాల్లో మత్స్యకారులు స్వచ్ఛందంగా వేటవిరమించి ఇళ్లవద్దే నిరసన దీక్షలు చేపడుతున్నారు. తీరప్రాంతాల్లో నెలకొల్పిన పరిశ్రమలనుంచి విడుదలయ్యే కాలుష్య రసాయనాలతో సముద్రజలాలు కలుషితమై మత్స్యసంపద అంతరించిపోతోందని, దీంతో జీవనోపాధిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉప్పాడ సెంటర్‌లో రెండురోజులపాటు ఆందోళన చేపట్టడంతో డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వచ్చేనెల 10లోగా ఉప్పాడవచ్చి మత్స్యకారుల సమస్యలపై చర్చిస్తామన్నహామీతో వారు తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఆయన రాకకోసం ఎదురుచూస్తున్నారు.

అంతర్జాతీయ క్రీడలకు వేదికగా రాజమహేంద్రవరం

శాప్ చైర్మన్ రవినాయుడు

ముగిసిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్



సింగిల్స్‌లో రన్నర్‌గా నిలిచిన రావత్‌కు బహుమతి ప్రదానం



విన్నర్‌గా నిలిచిన సూర్యచరిష్మా

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ క్రీడలకు రాజమహేంద్రవరం వేదిక కావాలని శాప్ చైర్మన్ ఏ.రవినాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ బ్యాడ్మింటన్ కోర్టుల్లో నిర్వహించిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2025 ఫైనల్స్ పోటీలు ఆదివారం సాయంత్రం జరిగాయి. విజేతలకు ముఖ్య అతిథి శాప్ చైర్మన్ రవినాయుడు, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ట్రోఫీలు, బహుమతులు అందజేశారు. రవినాయుడు మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి శాప్ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి పాలనలో క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని, ఆటలకు ప్రోత్సాహం అందజేస్తున్నారన్నారు. జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి బాలసుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

మహిళల సింగిల్స్ విజేత సూర్యచరిష్మా

మహిళల సింగిల్స్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్యచరిష్మా విజేతగా నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో భరత్ రాఘవ్ విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో సూర్య చరిష్మా 21-14, 21-22 స్కోర్ల తేడాతో హర్యానాకు చెందిన జియా రావత్‌పై గెలుపొందింది. పురుషుల సింగిల్స్‌లో హర్యానాకు చెందిన భరత్ రాఘవ్ అదే రాష్ట్రానికి చెందిన రవిపై గెలుపొందాడు. అలాగే, పురుషుల డబుల్స్‌లో నిషాత్ దురైస్వామి (తమిళనాడు), ప్రేజాన్ జోడీ అక్షన్ షెట్టి (మహారాష్ట్ర), శంకర్‌ప్రసాద్ ఉదయ్ కుమార్ (కేరళ)పై గెలిచారు. మహిళల డబుల్స్‌లో రుతపర్ణ పాండా (ఒడిశా), దీప్‌షికా సింగ్(ఢిల్లీ) జోడీ పవిత్ర నవీన్, గౌరీ కృష్ణ (కేరళ) 23-21, 24-22పై విజయం సాధించారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో దీప్ రాంభియా, సోనాలి మీర్‌ఖేల్కర్ (మహారాష్ట్ర) జోడీ ధ్రువ్ రావత్ (ఉత్తర్ ప్రదేశ్), మనీషా (ఆర్‌బీఐ)పై గెలుపొందారు.

అద్వితీయం... మహాశక్తి యాగం

ఏడో రోజు శ్రీపీఠానికి పోటెత్తిన మహిళలు

వారాహీదేవిగా ఐశ్వర్యాంబిక దర్శనం



లలితా సహస్రనామ సామూహిక కుంకుమార్చనలో మహిళలు



విశేషాలంకరణలో వారాహి అమ్మవారు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం గోశాల ప్రాంగణంలో 3వ మహాశక్తి యాగం ఆదివారం ఏడోరోజుకు చేరుకుంది. ఐశ్వర్యాంబిక అమ్మవారు వారాహీదేవిగా విశేషాలంకరణలో దర్శనమిచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో అమ్మవారికి వారాహి, కీలక స్తోత్ర హోమాలను పలు విశేష ద్రవ్యాలతో నిర్వహించారు. వంద కోట్ల కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు శ్రీపీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి అనుగ్రహ భాషణ చేశారు. నిత్యం 24 నిమిషాలు కేటాయించి లలితా సహస్రనామం పారాయణం చేయడం అలవరుచుకోవాలన్నారు. కంఠస్తం, హృదయస్తం చేసిన పారాయణతో కుంకమార్చన చేస్తూ అమ్మవారిపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. లలితా నామాన్ని ఉచ్చరించే సమయంలో పొత్తి కడుపు నుంచి మెదడు దాకా నాడులు యాక్టివేట్ అవ్వడం ద్వారా ఉత్సాహంగా, ఆరోగ్యంగా జీవించడంతో పాటు కోరిన కోర్కెలు నెరవేరేలా అమ్మ అనుగ్రహం ఉంటుందన్నారు. త్వరలో సుమారు 108 అడుగుల ఎత్తులో అమ్మవారి విగ్రహంతో పాటు మహాశక్తి దీపం ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. యాగం నిర్వహణకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ బిందు మాధవ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది, అధికారులు విశేషంగా సహకరిస్తున్నారన్నారు. సుమారు 35వేల మంది భక్తులు పాల్గొన్నారు. సర్పవరం సీఐ బి.పెద్దిరాజు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు పి.శ్రీనివాసకుమార్, ఆచార్యులు, సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అమ్మవారి పూలదండ రూ.లక్షా 5 వేలు!



మహిషాసుర మర్ధని అమ్మవారు

అమలాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పర్వదినాన మహిషాసుర మర్ధని అమ్మవారికి మెడలో అలంకరించే పూల దండ వేసేందుకు అనుమతి కోసం ఆదివారం ఉత్సవ కమిటీ నిర్వహించిన బహిరంగ వేలంలో ఒకరు రూ.లక్షా 5వేలకు పాట పాడి దక్కించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రవణం వీధిలో ఉన్న శ్రీమహిషాసుర మర్ధని అమ్మవారికి దసరా రోజు నిర్వహించే భారీ ఊరేగింపులో అమ్మవారి అలంకరణలో భాగంగా భారీ గజమాలను ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా బహిరంగ వేలం ద్వారా హైదరాబాద్‌లో ఉంటున్న ఆకుల లక్ష్మణరావు దక్కించుకున్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాల్ ద్వారా బహిరంగ వేలంలో పాల్గొని పూల దండ వేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. అమ్మవారి మెడలో పూలదండవేస్తే కోరిన కోర్కెలు తీరుతాయనే నమ్మకంతో ఆరోజు దండ వేసేందుకు చాలామంది పాటలో పాల్గొని పోటీపడి దక్కించుకోవడం ఆనవాయితీగా మారింది.

జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామి





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రొఫెసర్ స్వామి, పురుషుల కబడ్డీ పోటీల దృశ్యం

పెదపూడి (కరప), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో ప్రతిభ కనబరిచి యూనివర్శిటీకి జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కేవీ స్వామి సూచించారు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నన్నయ యూనివర్శిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ యూనివర్శిటీ పరిధిలో 395 గుర్తింపు పొందిన కళాశాలలున్నాయన్నారు. ఉప కులపతి ఆచార్య ప్రసన్నశ్రీ యూనివర్శిటీలో క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అక్టోబరు 4నుంచి 7వరకు కర్ణాటకలోని బెల్గాంలో గల రాణిచెన్నమ్మ యూనివర్శిటీలో జాతీయస్థాయి యూనివర్శిటీల గేమ్స్-స్పోర్ట్స్ మీట్ జరగనుందని, ఇందులో నన్నయ యూనివర్శిటీ పురుషుల కబడ్డీ జట్టు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాలని ఆకాంక్షించారు. గొల్లల మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ-కరస్పాండెంట్ డీఆర్కే రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో జనిగా పోటీల్లో కబడ్డీ జట్టు గోల్డ్ మెడల్ సాధిస్తే క్రీడాకారులకు తమ సంస్థ తరపున మంచి ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పోటీలను ప్రారంభించి సత్తా చాటిన క్రీడాకారులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీనివాసరెడ్డి, ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు ఎం.రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షురాలు ద్వారంపూడి చంద్రావతి, డీఆర్కే రెడ్డి కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివన్నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.త్రివేణి, జీఆర్ఎస్ఏ అధ్యక్షుడు డి.భాస్కర్‌రెడ్డి, పరిశీలకుడు మూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు శ్రీనివాస్‌కుమార్, శ్రీనివాసరావు, కార్యనిర్వాహకకార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా యానాం వెంకన్న కల్యాణం



వెంకన్న కల్యాణోత్సవ వేడుకల దృశ్యాలు



యానాం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): యానాం ప్రజల ఆరాధ్యదైవం శ్రీభూసమేత వేంకటేశ్వరుని కల్యాణోత్సవం మంగళవారం సంప్రదాయ రీతిలో వైభవంగా జరిగింది. కల్యాణ వేడుకను కరకుదురుకు చెందిన ఆగమ పండితులు వాడపల్లి గోపాలాచార్యులు పర్యవేక్షణలో శ్రీవాసవి కన్యక పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటేశ్వర స్వామి బాలలాయంలో శాస్త్రోంతంగా జరిగిన ఈ కల్యాణోత్సవంలో యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ఆలయ ఈవో జ్యోతి వెంకటేశ్వరరావు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యల తాలంబ్రాలును సమార్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ట్రాక్టర్ ఢీకొని పాస్టర్ మృతి



ఏసురత్నం (ఫైల్)

గొల్లప్రోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దైవ ప్రార్థనల కోసం చర్చికి వస్తూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పాస్టర్ చికిత్స పొందుతూ ఆదివారం మరణించారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని అగ్రహారానికి చెందిన దేవాది ఏసురత్నం (74) పాస్టర్‌గా ఉంటూ చర్చి ల్లో ప్రార్థనలు నిర్వహిస్తారు. గొల్లప్రోలులోని చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించేందుకు ఆదివారం ఉదయం స్కూటర్‌పై ఇంటి నుంచి బయల్దేరాడు. గొల్లప్రోలు బైపాస్‌లో వై.జంక్షన్ పెట్రోలు బంకు సమీపంలోకి వచ్చేసరికి పిఠాపురం నుంచి కత్తిపూడి వెళ్తున్న ట్రాక్టర్ అతివేగంగా వచ్చి ఢీకొంది. ఏసురత్నానికి తీవ్ర గాయాలు కాగా తొలుత పిఠాపురం అక్కడి నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. ఏసురత్నానికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద మృతిచెందిన మహిళ

ఆలమూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ, చొప్పెల్ల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం పొట్టిలంక గ్రామానికి చెందిన వెలగపు సుజాత(45), భర్త సూరిబాబుతో కలసి బైక్‌పై కపిలేశ్వరపురం ఏటిగట్టుపై నుంచి వెళ్తుండగా రాజమహేంద్రవరం నుంచి రాజోలు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుకనుంచి ఢీకొంది. సుజాత తలపై నుంచి బస్సు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఆలమూరు ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్టు ఆలమూరు ఎస్‌ఐ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం మోరంపూడికి చెందిన పసుపులేటి వేణుగోపాలరావు (47) ప్రతీ శనివారం ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రోజ్‌మిల్క్ వ్యాపారం చేస్తుంటాడు. శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తుండగా ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్టు ఎస్‌ఐ చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు నమోదు చేశామన్నారు.

లారీని ఢీకొని యువకుడు..

రాజోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ములికిపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పశ్చిమ గోదావరి జిల్లా యలమించిలి మండలం కలగంపూడికి చెందిన కడలి అక్షయ్ (21) ఆదివారం మృతిచెందాడని రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. అక్షయ్ చెన్నైలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. చెన్నై నుంచి కలగంపూడి వచ్చిన అక్షయ్ స్నేహితుడిని కలిసేందుకు కడలి మీదుగా ములికిపల్లి వెళ్తుండగా నలంద పబ్లిక్ స్కూలు సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి మోహనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల




జలాశయం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డొంకరాయి జలాశయం నుంచి నీటి విడుదలను ఆదివారం ఉదయం 5వేల క్యూసెక్కులకు పెంచినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1035.60 అడుగులకు చేరుకోవడంతో జెన్‌కో అధికారులు జలాశయం ప్రమాదస్థాయికి చేరుకోకుండా 1035.60 వద్ద నీటి మట్టం స్థిరంగా కొనసాగేలా దిగువకు 3వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే ఎగువన కురుస్తున్న వర్షాలకు జలాశయానికి ఇన్‌ఫ్లోస్ పెరుగుతున్న నేపథ్యంలో ఆదివారం ఉదయానికి జలాశయం నీటి మట్టం 1035.70 అడుగులకు పెరగడంతో జెన్‌కో అధికారులు నీటి విడుదలను మూడు వేల క్యూసెక్కుల నుంచి 5వేల క్యూసెక్కులకు పెంచారు. జలాశయంలోని 7వ నెంబర్ గేటును 2.90అడుగులు ఎత్తి 3వేల క్యూసెక్కులు, 6వ గేటు ద్వారా 1.84 అడుగులు ఎత్తి 2వేలు క్యూసెక్కులు మొత్తంగా 5వేల క్యూసెక్కుల నీటిని దిగువకు జెన్‌కో అధికారులు విడుదలచేస్తున్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న ముగ్గురిపై కేసు

బిక్కవోలు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు నుంచి భీమవరం వద్ద ఉండి చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తీసుకువెళ్తున్న వ్యాన్ డ్రైవర్, క్లీనర్, ఓనర్లపై కేసు నమోదు చేసినట్టు బిక్కవోలు ఎస్‌ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున బిక్కవోలులోని కాటన్ విగ్రహం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బొలేరో వ్యాన్‌లో కోళ్ల వ్యర్థాలను గుర్తించారు. వ్యాన్ డ్రైవర్, క్లీనర్ కాకినాడ జిల్లా కాజులూరు మండలం తిప్పరాజుపాలెంకు చెందిన చెయ్యేటి నరేంద్ర, బిక్కవోలు మండలం ఆరికరేవులకు చెందిన వారా క్రాంతిలను అరెస్టు చేసి వ్యాన్ సీజ్ చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అలాగే వ్యాన్ యజమాని కామర్తి దుర్గాప్రసాద్‌పై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.

చింతలూరులో కొండచిలువ హల్‌చల్



ఆలమూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కొండలు, అడవి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపించే కొండచిలువ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో హల్‌చల్ చేసింది. ఆదివారం చింతలూరు కాలువ వద్ద కనిపించడంతో అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా భయభ్రాంతులయ్యారు. చివరికి దానిని హతమార్చారు. అటవీప్రాంతంలో ఉండే కొండచలువ ఇక్కడకు రావడం పట్ల స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. కొండచలువ సుమారు 8 అడుగుల పొడవు ఉన్నట్టు తెలిపారు. అయితే కొండల వద్ద నుంచి వస్తున్న గ్రావెల్ లారీల ద్వారా కొండచలువ వచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు.

రాయవరంలో ఆలయ స్థలం వివాదం

ఒక వర్గంపై రాళ్ల దాడి

గాయపడి ఒకరు మృతి, ఏడుగురికి గాయాలు



మృతిచెందిన సత్యనారాయణ (ఫైల్)



రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

రాయవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం పోలమ్మ ఆలయం సమీపంలో ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయం వద్ద షెడ్డు నిర్మాణం చేస్తున్న నేపథ్యంలో ఆదివారం ఆలయ సరిహద్దు ఇంట్లో ఉన్న వ్యక్తి, అతడి కుటుంబ సభ్యులు రాళ్ల దాడికి పాల్పడిన సంఘటనలో వ్యక్తి త్రీవంగా గాయపడి మృతి చెందగా మరో ఏడుగురు వ్యక్తులు గాయాలపాలై చిక్సిత పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయవరంలో శ్రీపోలమ్మ ఆలయం పక్కనే ము త్యాలమ్మ ఆలయం ఉంది. ఆలయ సరిహద్దులో రేలంగి నాగేశ్వరరావు అనే వ్యక్తి ఇళ్లు ఉంది. ఆలయ నిర్వహక కమిటీకి, సరిహద్దులో ఉన్న నాగేశ్వరరావుకు గత కొన్నేళ్లుగా సరిహద్దు వివాదం నడుస్తుంది. ఆలయం వద్ద ఉన్న స్థలం తనది అంటూ నాగేశ్వరరావు, స్థలం ముత్యాలమ్మ ఆలయానిదే అంటూ ఆలయ నిర్వహకులు చెబుతుండటంతో వివాదం నడుస్తుంది. పోలమ్మ ఆలయ నిర్వహకులు ఆలయం వద్ద స్థలంలో రేకుల షెడ్డు నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివాదం జరగడంతో నాగేశ్వరరావు అతడి కుటుంబ సభ్యులతో కలిసి ఇంటిపై నుంచి కారం నీళ్లు చల్లి రాళ్లతో ఆలయ షెడ్డు నిర్మాణం చేస్తున్న కమిటీ, షెడ్డు వద్ద వ్యక్తులపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో గ్రామానికి చెందిన బోదంకి సత్యనారాయణ (51) అలియాస్ సత్తిబాబు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందాడు. మరో ఏడుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. దాడి చేసిన రేలంగి నాగేశ్వరరావు పరారీలో ఉన్నట్టు సమాచారం.

డీఎస్పీ పరిశీలన

రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద రాళ్ల దాడి జరిగిన ప్రాంతాన్ని రామచంద్రపురం ఇన్‌చార్జ్ డీఎస్పీ టీవీఎస్ఆర్‌కే ప్రసాద్ పరిశీలించారు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్‌ఐ డి.సురేష్ బాబు వివాదంపై ఆరా తీశారు. రాయవరం పోలీసులు కేసు నమోదు చేయనున్నారు.

రావులపాలెం అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన చాంబర్ అధ్యక్ష,పాలకవర్గ సభ్యులు రావులపాలెం అభివృద్ధికి కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఫంక్షన్‌హాలులో రావులపాలెం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు పాల్గొని అధ్యక్షుడు పోతంశెట్టి కనికిరెడ్డితో పాటు నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యక్తికో ఒక వర్గానికో చెందినది కాదని, అందరూ సమష్టిగా ఏర్పాటు చేసుకున్న సంఘమన్నారు. వినియోగదారులకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయ్యాలన్నారు. చాంబర్ అధ్యక్షుడు, రాజపురస్కార అవార్డు గ్రహీత పోతంశెట్టి కనికిరెడ్డి మాట్లాడుతూ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. పాలకవర్గ సభ్యుల సమన్వయంతో చాంబర్ భవన ఆధునీకరణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వ్యాపారులు వినియోగదారులతో సమన్వయంగా పనిచేస్తు వ్యాపారాలు సాగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, గుత్తుల రాంబాబు, కొప్పిశెట్టి ప్రసాద్, తమలంపూడి రామకృష్ణరెడ్డి, చిన్నం శ్రీనివాసరెడ్డి, సాధనాల శ్రీను కూటమి నాయకులు పాల్గొన్నారు. చాంబర్ అధ్యక్షుడిగా నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన పోతంశెట్టి కనికిరెడ్డిని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట కర్రి నాగిరెడ్డి తదితరులున్నారు.

ఆకర్షణీయంగా..

అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రధాన సెంటర్‌లో తమిళనాడుకు చెందిన వివిధ జాతుల రకాల పక్షులను విక్రయిస్తున్నారు. ఫ్రెంచ్, టర్కీ బాతులు, కడకనాథ్, చీటా కోళ్లు, గిన్నె కోళ్లు ఉన్నాయి. దీంతో వీటి కోసం చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. - ఎటపాక (ఆంధ్రజ్యోతి)





కనకదుర్గమ్మకు కరెన్సీతో అలంకారం

పిఠాపురం పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద కొలువైయున్న కనకదుర్గమ్మను ఆదివారం కరెన్సీతో అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. శృంగేరీ శంకర మఠం నిర్వహణలో పెద్దబజారులో వేంచేసియున్న మహాలక్ష్మీదేవికి మోహిని అలంకారం చేశారు. కుంకుమ పూజలు, చండీ హోమం జరిపారు. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

- పిఠాపురం (ఆంధ్రజ్యోతి)



అపర్ణా దేవికి బొమ్మల కొలువు

గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణా దేవి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అమ్మవారు చండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి పూజలు చేయగా వేదపండితుడు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు. దుర్గాడ శివాలయంలో లలితాదేవి మహాలక్ష్మీ స్వరూపిణిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పూజలు చేశారు.

- గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి)



సంతాన లక్ష్మిగా బాలకనకదుర్గమ్మ

కొమరగిరిలో బాల కనకదుర్గమ్మ అమ్మవారిని 108 చీరలతో అలంకరించారు. సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారిని కొమరగిరి, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు దర్శించుకున్నారు.

- కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి)

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలి: ఆర్జేడీ నాగమణి



ముఖ్య అతిథి, ఆర్జేడీ నాగమణికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

కాకినాడ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మెగా డీఎస్సీ ద్వారా నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) జి.నాగమణి సూచించారు. కాకినాడ శ్రీనగర్‌లోని ఆదిత్య అకాడమీలో ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి అధ్యక్షతన ఆదిత్య కాలేజ్ ఆఫ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ విభాగంలో మెగా డీఎస్సీ కోసం శిక్షణ పొంది ఉపాధ్యాయులుగా ఎంపికైన వందలాది మంది అభ్యర్థులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్జేడీకి శేషారెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆమె జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను సత్కరించారు. శేషారెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ నుంచి ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఉత్తమ ఉపాధ్యాయులుగా రాణించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను, వారికి శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను సత్కరించారు.

బాస్కెట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు కారుణ్య ఎంపిక



పిఠాపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు పిఠాపురానికి చెందిన బాలిక ఎంపికైంది. బాదం మాధవరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న పాల కారుణ్య ఏంజెల్ చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు సభ్యురాలిగా పాల్గొని ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికై చిత్తూరులో గత 15 రోజులుగా శిక్షణ పొందుతోంది. ఈమె అక్టోబరు 4 నుంచి 10వ తేదీ వరకూ ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి అండర్-13 బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏపీ జట్టు తరపున పాల్గొననున్నది. కారుణ్యను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బొజ్జా మాణిక్యాలరావు, పిఠాపురం అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మొగలి కాశీవిశ్వనాథం, ఉపాధ్యక్షుడు డాక్టర్ గుబ్బల ఎలీషాబాబు, ఎం.రాజారావు, వీఎస్ రెడ్డి, కోశాధికారి కొత్తెం సుందరకుమార్, నంబోలు అర్జున్ తదితరులు అభినందించారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాళ్లరేవు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ పల్లిపాలెం ఫీడరుపై మరమ్మతుల నిమిత్తం సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. చొల్లంగి సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పి.మల్లవరం, పోలేకుర్రు, పత్తిగొంది, జార్జిపేట, నీలపల్లి, చొల్లంగి ఇండస్ట్రియల్ ఏరియా, పటవల, చొల్లంగిపేట, కొత్తూరు, రామన్నపాలెం, మట్లపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ చెప్పారు.

ఎమ్మెల్సీ హరిప్రసాద్ పర్యటన

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఆదివారం గొల్లప్రోలులో పర్యటించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో మంజూరైన సీఎస్ఆర్ నిధులతో పట్టణ శివారులోని కొత్త కాలనీకి వెళ్లే మార్గంలో నిర్మించిన బ్రిడ్జిని పరిశీలించారు.



'చేసిన సేవలే గుర్తింపునిస్తాయి'

కరప, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో చేసిన సేవలే సమాజంలో మంచి గుర్తింపునిస్తాయని గొర్రిపూడి ఎంపీటీసీ పుణ్యమంతుల సింహాద్రమ్మ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి సత్తింశెట్టి వీరబాబును కూటమి నాయకులతో కలిసి ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి గ్రామాభివృద్ధికి వీరబాబు అహర్నిశలూ కృషి చేస్తున్నారని కొనియాడారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేస్తున్నారని పలువురు అభినందించారు. జనసేన నాయకులు పుణ్యమంతుల అన్నవరం, అనుకుల రాంబాబు, కానూరి సురేష్, గండి సూర్యచంద్రశేఖర్, సింహాచలం, పండు పాల్గొన్నారు.



గొర్రిపూడి గ్రామ కార్యదర్శి వీరబాబును సత్కరిస్తున్న కూటమి నాయకులు

కనకదుర్గమ్మకు చీర, సారె సమర్పణ

సామర్లకోట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత్రుళ్ల వీధిలో కనకదుర్గ అమ్మవారికి వందలాది మహిళలు భారీ ప్రదర్శనగా వెళ్లి చీర, సారె అందజేశారు. వాటితో పాటు పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, 101 రకాల పిండి వంటలను కూడా తీసుకెళ్లారు. రాష్ట్ర అయ్యరక సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ దంపతులు ప్రదర్శన అగ్ర భాగాన ఉన్నారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ ఆలయ అర్చకులు పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు పెదిరెడ్ల కృష్ణ, బొడుగు ప్రసాద్, కర్రి నారాయణ, కర్రి ఉమామహేశ్వరరావు, రామకృష్ణ, ఎలిశెట్టి శివాజీ పాల్గొన్నారు.



అమ్మవారికి సమర్పించేందుకు చీర, సారెలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

9 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత

కాకినాడ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ బాదం బాలకృష్ణ క్లినికల్‌ల్యాబ్ ఆవరణలోని రెడ్ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో తొమ్మిది మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ ఆదివారం అందజేశారు. హృదయ, పేంక్రియాస్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మూడు నెలలకు సరిపడా మందులను పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షుడు బాదం బాలకృష్ణ, కోశాధికారి జగన్నాథరావు, పాపారావు, రామ్‌చరణ్, రమణమూర్తి పాల్గొన్నారు.

మహిళ ఫిర్యాదుతో సామర్లకోట ఎంపీపీపై కేసు నమోదు

సామర్లకోట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఒక వివాహిత ఫిర్యాదు మేరకు సామర్లకోట ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబుపై కేసు నమోదు చేసినట్టు సీఐ కృష్ణభగవాన్ ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. హుస్సేన్‌పురానికి చెందిన మహిళతో ఎంపీపీ కొన్నేళ్లు సహజీవనం చేసి ప్రస్తుతం వేరే మహిళతో ఉంటున్నాడు. ఇదేంటని నిలదీసిన తనను కొట్టడమే గాక హతమారుస్తానని బెదిరిస్తున్నట్టు ఫిర్యాదు చేసింది. కాగా ఈ ఘటనకు సంబంధించి సామర్లకోట పోలీస్ స్టేషన్లో మూడు రోజులు జరిగిన రాజీ చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఆదివారం మూడు సెక్షన్లతో సామర్లకోట పోలీసులు కేసు నమోదు చేశారు.



జగ్గంపేట సీఐ తనిఖీలు

జగ్గంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలోని ట్రాన్స్‌పోర్ట్ అండ్ పార్శిల్ సర్వీస్ సెంటర్లను జగ్గంపేట సీఐ శ్రీనివాస్ సిబ్బందితో ఆదివారం తనిఖీ చేశారు. అనుమానిత, నిషేధిత పదార్థాలు రవాణా అవుతున్నట్లు గుర్తిస్తే తక్షణం పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దీపావళిని పురస్కరించుకుని పేలుడు సామగ్రి ఎగుమతి, దిగుమతులను చేయరాదన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తగ్గుతూ పెరుగుతున్న శబరి నది



సోకిలేరు వాగుపై పడవ దాటుతున్న లోతట్టు వాసులు

చింతూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు వద్ద శబరినది తగ్గుతూ పెరుగుతూ ఉంది. ఈక్రమంలో ఆదివారం చింతూరువద్ద శబరినది 31.5 అడుగులమేర ప్రవహిస్తోంది. గోదావరి ఎగపోటు కొనసాగుతూనే ఉంది. దీంతో కల్లేరు, ముకునూరు, పెద్దసీతనపల్లి, రామన్నపాలెం, ఏజీ కొడేరు గ్రామ పంచాయతీలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో లోతట్టు వాసులు ఇక్కట్లు పడుతున్నారు.

ధర్మయుద్ధ సభకు తరలివెళ్లిన ఆదివాసీ జేఏసీ



ధర్మయుద్ధం సభకు తరలివెళుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ జేఏసీ

చింతూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం భద్రాచలంలో ఆదివారం ఆదివాసీలు ధర్మయుద్ధం సభ నిర్వహించారు. చింతూరు నుంచి ఆదివాసీ జేఏసీ నాయకత్వంలో ఆదివాసీలు, ఆదివాసీ ఉద్యోగ సంఘాల వారు పెద్దఎత్తున సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా చింతూరు డివిజన్ ఆదివాసీ జేఏసీ చైర్మన్ జల్లి నరేష్ మాట్లాడారు. బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తమ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. ఈ మేరకు భద్రాచలంలో బంజారాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలన్న ప్రధాన డిమాండ్‌తో ధర్మయుద్ధం పేరిట బహిరంగసభ ఏర్పాటు చేస్తామన్నారు. సభకు చింతూరు డివిజన్ నుంచి ఆదివాసీలు పెద్దఎత్తున తరలివెళుతున్నట్లు నరేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

అన్నదానంకు బియ్యం వితరణ



బియ్యం వితరణ ఇచ్చిన జమాల్‌ఖాన్

చింతూరు, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): చింతూరులోని దుర్గమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో జేకే సీటీ చైర్మన్ జమాల్ ఖాన్ ఆదివారం ఆలయ కమిటీకి రెండు క్వింటాళ్ల బియ్యం వితరణ చేశారు. అన్నదాన కార్యక్రమ నిర్వహణలో భాగం గా బియ్యం అందించినట్టు ట్రస్ట్ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు శేఖర్, పయ్యాల నాగేశ్వరరావు, శేషవతారం, అబ్బు పాల్గొన్నారు.

లేగదూడకు ప్రథమ చికిత్స



లేగదూడకు ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్పీఎఫ్ సిబ్బంది

చింతూరు మండలం మోతుగూడెం పర్యాట కేంద్రంగా మారడంతో దసరా సెలవులకు పర్యాటకులు తాకిడి ఎక్కువైంది. దీంతో రోడ్డుపై వస్తున్న లేగదూడను ఒక పర్యాటకుడి వాహనం గుద్దేసి వెళ్లిపోయింది. దీంతో ఆ లేగదూడ గాయమై కాలు విరిగిపోయింది. ఈ దూడ అరుస్తూ రోడ్డుపక్కగా పడిపో యింది. దీనిని గమనించిన సీఆర్పీఎఫ్ఎ/42 సిబ్బంది లేగ దూడని గమనించి దానికి ప్రథమ శికిత్స చేశారు. అప్పటికే దాని కాలు విరిగిపోయి ఉంది. సీఆర్పీఎఫ్ సిబ్బంది గాయానికి కట్లు కట్టి వైద్యశాలకు తీసుకెళ్లి మెరుగైన వైద్యం చేయించారు.

శ్రీలక్ష్మి గణపతి ఆలయంలో

దుర్గాదేవికి 108 కలశాలతో జలాభిషేకం



మోతుగూడెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం లక్ష్మి గణపతి ఆలయంలో ఉన్న మూల విరాట్ దుర్గాదేవి వేకువ జాము నుంచి ప్రధాన అర్చకుడు శ్రీనివాసరావు పవన్ ఆధ్వర్యంలో 108 కలశాలతో జలాభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మి గణపతి యూత్ కమిటీ పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణతో

వ్యాపార రంగానికి ప్రయోజనం

● డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు



తగ్గిన జీఎస్టీ పత్రాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో, టీడీపీ నాయకులు

ఎటపాక, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణతో వ్యాపార రంగానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఎటపాకలో జీఎస్టీ తగ్గుదలపై చిరువ్యాపారులకు అవగాహన కల్పిం చారు. జీఎస్టీ తగ్గింపువల్ల నిత్యావసర వస్తువులు, మందులు, ఇతరత్రా 83 రకాలపై ధరలు తగ్గాయని చెప్పారు. దీనివల్ల ప్రజలకు నేరుగా లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ మేరకు వ్యాపారులు కూడా తగ్గిన ధరల బోర్డులు ప్రదర్శించాలని కోరారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, అరకు పార్లమెంటరీ కార్యదర్శి మువ్వా శ్రీనివాస్, టీడీపీ సీనియర్ నాయకులు పాటి చలపతి, బాచినేని శ్రీకాంత్, గొడేటి రవికుమార్ పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన

కూనవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని షాప్ యజమానులకు ప్రజలకు అధికారులు జీఎస్టీ పై ఎంపీడీవో జగన్నాధరావు అవగాహన కల్పిస్తున్నారు. జీఎస్టీ 2.0లో భాగంగా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్‌ల గురించి వివరిస్తున్నారు. తగ్గిన జీఎస్టీ ధరలు గురించి ప్రతిఒక్కరు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దాని ప్రయోజనాలు తెలుసుకోవాలనాన్నరు. జిఎస్టి ఏ విధంగా అమలు అవుతుందో దాని గురించి ఒక ప్రత్యేక అధికారి కూడా నియమించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మర్రిగూడెం కార్యదర్శి రాజాబాబు చూచి రేవుల కార్యదర్శి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శులు

మహాచండీగా కనకదుర్గమ్మ దర్శనం

ప్రత్తిపాడు, సెప్టెంబరు28(ఆంధ్రజ్యోతి):మండలంలో శరన్నవరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్తిపాడు, ధర్మవరం, రాచపల్లి, ఒమ్మంగి గ్రామాల్లోని కనకదుర్గ అమ్మవార్లను మహాచండీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో అపీత కుచాంబ అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. శరభవరంలో మహిళలు బోనాల జాతర నిర్వహించారు. గజ్జెనపూడిలో అమ్మవా రికి కలశాలతో నివేదన చేశారు. ధర్మవరం సత్తెమ్మతల్లి ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.







గండేపల్లి: భక్తులకు దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ, రౌతులపూడి: మహాచండిగా దర్శనమిచ్చిన అమ్మవారు ప్రత్తిపాడు: శరభవరంలో బోనాల జాతర దృశ్యం

మురారి దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

గండేపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):మురారిలో కనకదుర్గమ్మను ఆదివారం భవాని మాల దీక్షాదారులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాచండీగా దుర్గాదేవి

రౌతులపూడి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారు మహాచండిగా దర్శనమిచ్చారు. పసుపుకొమ్ములతో అమ్మవారిని అలకరించారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మలబాబు దర్శించుకున్నారు.

భగత్‌సింగ్ యువతకు స్ఫూర్తి

ఏలేశ్వరం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ అన్నారు. ఆదివారం భగత్ సింగ్ జయంతి సందర్భంగా పాత కాంప్లెక్స్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పైల విజయ్‌కుమార్, కావలి శ్రీను, కోరాడ ప్రసాద్, యోహోను, గోళ్ల విజయ్‌కుమార్, ఉద్దగిరి సాయినాధ్‌పాల్గొన్నారు.

లోవలో భక్తుల కోలాహలం

ఆలయానికి రూ.1.69లక్షల ఆదాయం



మహాచండీ అలంకరణలో తలుపులమ్మ తల్లి, బారులుతీరిన భక్తులు

తుని రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. శరన్నవరాత్రి వేడుకలు పురస్కరించుకుని వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారు మహాచండీ దేవి అలంకరణలో భక్తులను అనుగ్రహించారు. ఆలయ ప్రాంగణంలో వంటా వార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి రూ.1.69లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

రోగులతో వచ్చే సహాయకులకు ఉచిత భోజనం



ఆసుపత్రి వద్ద మాట్లాడుతున్న జ్యోతుల నవీన్

గండేపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలాద్రిరావుపేట గ్రామ శివారున ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, సహాయకులకు ఉచిత భోజనం జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ అన్నారు. దీనిలో భాగంగా షెడ్డు నిర్మాణానికి ఆదివారం స్థల పరిశీలన చేశారు. త్వరలోనే జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ ద్వారా ఆసుపత్రికి పేషెంట్లతో పాటు వచ్చే సహాయకులకు ఉచిత భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. త్వరగా షెడ్డు నిర్మాణ పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట అడబాల వెంటేశ్వరరావు, అనుకుల శ్రీకాంత్, భూపాలపట్నం ప్రసాద్, తూము కుమార్, పాలచర్ల నాగేంద్ర చౌదరి, డాక్టర్ వినుషా ఉన్నారు.

ఆదిత్యలో ఫోరెన్సిక్ సంచిక విడుదల

గండేపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీకి చెందిన ఫోరెన్సిక్ కళాశాల భారతదేశపు మొట్టమొదటి ద్వైమాసిక ఫోరెన్సిక్స్ సైన్స్ మేగజైన్ ఫోరెన్సిక్స్ మొదటి సంచికను పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజు విడుదల చేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఫోరెన్సిక్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ ప్రచురించిన ఈ మేగజైన్‌లో డీఎన్ఏ ఫోరెన్సిక్స్, డీప్ ఫేక్ ఆడియో అండ్ వీడియో, సైబర్ క్రైమ్ వంటి అనేక విభాగాలకు సంబంధించిన అధునాతన పరిశోధనలతోపాటు, విద్యార్థులు, పరిశోధకుల రచనలు ఉన్నాయి. కార్యక్రమంలో ఆదిత్య యూనివర్సిటీ, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫోరెన్సిక్స్ ఆఫ్ సైన్సెస్, అసోసియేట్ డీన్, మరియు మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ విలాస్ అనిల్ చవాన్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

అన్నవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం జరిగింది. 1992-93లో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకున్నారు.



ఆదిత్యలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

'ఆదిత్య'లో ఘనంగా

దేవీ శరన్నవరాత్రి వేడుకలు

గండేపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, ఫార్మసీ డీన్ డాక్టర్ డి.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమల గరుడ సేవలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

తిరుమలలో గరుడ సేవలో

ఎమ్మెల్యే జ్యోతుల మణి దంపతులు

జగ్గంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు గరుడ వాహనంపై తిరువీధుల్లో ఊరేగారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు

జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ స్వప్న

ప్రత్తిపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లోని అధికారులు, సిబ్బంది, విధులు సక్రమంగా నిర్వహించకపోతే చర్యలు తప్పవని కాకినాడ జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ స్వప్న హెచ్చరించారు. ప్రత్తిపాడులోని వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె సందర్శించి ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవల పనితీరును పరిశీలించారు. శానిటేషన్, సెక్యూరిటీ, వాటర్ లీకేజీ, ఓపీ వంటి పలు అంశాలపై తనిఖీలు చేశారు. వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో సక్రమంగా విధులు నిర్వహించకపోతే చార్జ్‌మెమోలు జారీ చేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా నిర్మించే ఆసుపత్రి భవనాన్ని డాక్టర్ స్వప్న పరిశీలించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య షైబేల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రెడ్డి దంపతులు

బీసీ కార్పొరేషన్ చైర్మన్‌కు

ఎమ్మెల్యే సన్మానం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన రెడ్డి అనంతకుమారి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సన్మానించారు. ఆదివారం కొత్తపేట వెళ్లి రెడ్డి దంపతులను కలిసి శాలువాతో సత్కరించి ఎమ్మెల్యే సత్యప్రభ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యాళ్ల జగదీష్, అంబటి రాంబాబు తదితరులు ఉన్నారు.



జనసేన జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఉదయ శ్రీనివాస్

కార్యకర్తలను కలుస్తాం

ఎంపీ తంగెళ్ల

రౌతులపూడి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తను త్వరలో కలుసుకుంటామని ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. రౌతులపూడిలో జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ కాకినాడ పార్లమెంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీ, కోల్‌కతాలో మాత్రమే ఉన్న ఐఐఎఫ్‌టీని కాకినాడకు తీసుకు వచ్చామన్నారు. డీసీసీబీ చైర్మన్ తమ్మల బాబు మాట్లాడుతూ కత్తిపూడి-రౌతులపూడి రహదారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. స్థానిక ఎన్నికల్లో విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో మేడిశెట్టి బాబి, కరణం సుబ్రహ్మణ్యం, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గంటా కుమార్, షేక్ సలిమ్, నిర్జా నాగు, పక్కుర్తి సతీష్ పాల్గొన్నారు.

డైరెక్టర్ దుక్కిపాటికి

కాంట్రాక్ట్ ఉద్యోగుల వినతి

ప్రత్తిపాడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ టెక్స్ట్ బుక్స్ డైరెక్టర్ దుక్కిపాటి మధుసూధనరావుకు కాంట్రాక్టర్ ఉద్యోగుల ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యోగ సంఘ నాయకులు వివరించా రు. ఆదివారం పండూరి గురుకులానికి విచ్చేసిన మధుసూధనరావును ఏపీసీఆర్పీయునైటెడ్ ఫోరం అధ్యక్షులు ఎలిపే రాంజీ ప్రసాద్, సంఘ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీఆర్పీడబ్ల్యూఏ భరోసా కన్వీనర్ ఎ.రాజేంద్రకుమార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. రవికుమార్ తదితరులు ఉన్నారు.

మహాచండీ అమ్మవారికి సారె సమర్పణ

ఏలేశ్వరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని మహాచండీగా అలంకరించారు. మహిళలు తోట వీధి దుర్గమ్మకు పసుపు, కుంకుమ, గాజులు, పట్టువస్త్రాలు, వివిధ రకాల పిండి వంటలు సమర్పించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కనకదుర్గమ్మకు పూజలు

గండేపల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మల్లేపల్లి కొత్తూరులో విజయ కనకదుర్గ ఆలయంలో పురోహితుడు చింతా అరుణ కుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష అలంకరణ చేశారు. త్రిపుర భైరవి అలంకరణలో ఉన్న అమ్మవారికి నరవ శ్రీనివాస్, డేగల శ్రీనివాస్ దంపతులు పీటల మీద కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు.

సత్యదేవుడికి ఘనంగా రథోత్సవం



అన్నవరం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో వారాంతపు ఆర్జిత సేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి, అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. ప్రత్యేకపూజలు అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిన గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన అప్పలరాజు



జగ్గంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో ఒక ప్రైవేటు ఫంక్షన్‌లో రాష్ట్ర అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు మర్యాదపూర్వకంగా కలిశారు.